

నూజెండ్ల మండలంలో పునాదుల్లోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం




గుంటూరులోని జగనన్న కాలనీలో పునాదులకు కూడా నోచుకోని వైనం.

జగనన్న ఊళ్లు పునాదుల్లోనే..

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నాం అని ఆర్భాటంగా సీఎం జగన్ ప్రకటించి నాలుగేళ్లు అవుతున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులను తల పిస్తున్నాయి. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. ఇప్పటికీ చాలాకాలనీల్లో రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు. పేరుగొప్ప, ఊరుదిబ్బ అనుచందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుందని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణా లకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవస రమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమ య్యారు.

నెరవేరని పేదల సొంతింటి కల

- చిట్టడవుల్లా మారిన జగనన్న కాలనీలు
- కట్టిస్తామని మడమ తిప్పిన సీఎం జగన్
- బిల్లుల జాప్యంతో బేస్‌మెంట్ల స్థాయిలోనే ఇళ్లు
- ఇంకా పూర్తికాని మౌలిక సదుపాయాల కల్పన
- సగం కాలనీల్లో స్థలాల మెరక, అప్రోచ్ రోడ్లే కరువు
- పేరుగొప్ప, ఊరుదిబ్బ అనుచందంగా జగనన్న కాలనీలు



రూపాయి ఇవ్వకుండా గొప్పలు


పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పేరుతో రూపాయి కూడా ఇవ్వకుండా తామే ఇళ్ల నిర్మించి ఇస్తున్నట్లు జగన్ ప్రచారం చేసుకున్నారు. కేంద్రం ద్వారా ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వగా వాటిని జగన్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని, అది తానే ఇచ్చినట్లు లబ్ధిదారులకు ప్రచారం చేసుకుంది. ఇళ్లు తామే నిర్మించి ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. ఒక్క రూపాయి కూడా పేదోడి ఇంటి కోసం ఖర్చు చేయని ప్రభుత్వంగా సీఎం జగన్ నిలిచిపోయారని పలువురిలో అసహనం వ్యక్తమవుతోంది.



మాచర్ల: బేసుమట్టంలోనే రెంటగుట్టలోని జగనన్న కాలనీ



నడికూడి :అసంపూర్తిగా జగనన్న కాలనీ గృహాలు



వినుకొండ : వెంకుపాలెం వద్ద జగనన్న కాలనీలో నిర్మాణంలో ఇళ్ళు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 26: 'పేదలకు సొంతింటి కల నెరవేరుస్తా. పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తా. వాటిని అక్క చెల్లెమ్మల పేరు మీదే రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తా.. అని పేదల ఇళ్ల నిర్మాణంపై జగన్ ఇచ్చిన హామీ అమలు అంతంతమాత్రంగానే ఉంది. హామీ ఇచ్చి ఏళ్లు గడిచినా జగనన్న కాలనీలు ఇంకా చాలావరకు అందుబాటులోకి రాలేదు. పేదలకు ఇంటిని ప్రభుత్వమే కట్టిస్తుందని, కాలనీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తుందని తొలుత సీఎం జగన్ ప్రకటించారు. అయితే జగనన్నకాలనీల ప్రారంభోత్సవం అనంతరం లబ్ధిదారులే కట్టుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అయితే చాలామంది ఆసక్తి చూపలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో గత నవంబరులో కొద్ది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి పేదల సొంతింటి కల నెరవేర్చినట్లు ప్రకటించుకుంది. క్షేత్ర స్థాయిలో పేదల ఇళ్ల నిర్మాణం పురోగతి అధోగతిలో ఉంది. మొత్తం నిర్మాణ లక్ష్యంలో నాలుగోవంతు కూడా పూర్తి చేయలేకపోయారు. మిగిలిన ఇళ్ళ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించడంలో ప్రభుత్వం చతికిలపడింది. కాలనీలకు మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యంతోనే నిర్మాణాలు సక్రమంగా సాగలేదని తెలుస్తోంది. పలు కాలనీల్లో పూర్తయిన ఇళ్లల్లో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా కాలనీలు ఉండటం, రవాణా సౌకర్యం లేకపోవడం తదితర అంశాలతో అక్కడకు వెళ్లి పెద్దమొత్తంలో వెచ్చించి ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. అధికారులు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చి ఇళ్ల నిర్మాణాలు చేయించినా సకాలంలో బిల్లులు రాక చాలాఇళ్ల బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. ఇప్పటికే అప్పులు పాలయ్యాం ఇక తమ వల్ల కాదని లబ్ధిదారులు వెనుకంజ వేశారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక జగనన్న కాలనీలు పిచ్చి చెట్లతో అధ్వానంగా మారాయి. కాలనీలల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాల విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. జగన్ ప్రతిపక్ష నేతగా హామి ఇచ్చిన మేరకు రూ 5 లక్షలు ఇచ్చారా? అంటే లేదు, ఇంటి నిర్మాణానికి తగ్గట్టుగా వ్యయాన్ని పెంచలేదు. ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగి ఇల్లు కట్టుకోవడం లబ్ధిదారులకు సాధ్యం కాలేదు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నాలుగేళ్లగా ముందుకు సాగలేదు.



నరసరావుపేట లింగంగుంట్ల లేఅవుట్‌లో ప్రారంభం కాని ఇళ్ళ నిర్మాణాలు

- మాచర్ల నియోజకవర్గంలో 21 లే అవుట్లలో 5110 మందికి ఇళ్లు మం జూరు చేయగా 150 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. పేదల పేరుతో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీలో తన అనుచరులకు దోచిపెట్టారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి 3 నుంచి 5 సెంట్లు చొప్పున కేటాయించగా ఆ స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. పేదల కాలనీ కాస్తా ధనవంతుల కాలనీగా మారింది.
- గురజాల నియోజకవర్గంలో 5681 మందికి గృహాలు మంజూరు కాగా ఇప్పటికీ 1400 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లోనే ఉన్నాయి. మొక్కుబడిగా అక్కడక్కడ వేసిన బోర్లకు నీరు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణం కూడా నత్తనడకన జరిగింది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా సర్వీసు వైర్లు వేయలేదు. కొండమోడు, లెనిన్ నగర్ ప్రాంతాల్లో కొందరు గుట్టుగా విక్రయించినట్లు ఆరోపణలున్నాయి.
- సత్తెనపల్లికి సంబంధించి భీమవరం, గండ్లూరులో నాలుగు లే అవుట్లలో 1952 మందికి స్థలాలు ఇస్తే 398 మాత్రమే ఇళ్లు కట్టుకున్నారు. పట్టణంలోని 9, 23, 24 వార్డులకు చెందిన 450 మందికి మండలంలోని కంకణాలపల్లి, పాకాలపాడులో ఇచ్చిన స్థలాలు గృహనిర్మాణానికి పనికి రావని అక్కడ గృహ నిర్మాణాలను ప్రారంభించలేదు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ళలో 1243 మందికి 356 మంది గృహాలు నిర్మించుకున్నారు.




బొందిలిపాలెంలో అడవిని తలపిస్తున్న జగనన్న కాలనీకి కేటాయించిన ఇళ్ళ స్థలాలు దుస్థితి

వినుకొండ పట్టణానికి 7 కిలోమీటర్ల దూరంలో 100 ఎకరాలను సేకరించి 4784 మందికి స్థలాలు పంపిణీ చేశారు. అయితే ఇప్పటికి 1548 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. చుట్టూ కొండ ప్రాంతం కావడం, రాత్రిళ్లు విషసర్పాలు, అడవి జంతువులు సంచారం, పట్టణానికి దూరంగా ఉండడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపలేదు. మౌలిక వసతులు లేకపోవడం, కట్టుకున్న వారికి బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు వెనుకంజ వేశారు. ఇక నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు.



ధూళిపాళ్ల లే అవుట్‌లో అసంపూర్తిగా గృహ నిర్మాణాలు

స్క్రూటినీ.. ఉత్కంఠ



- తెనాలి వైసీపీ అభ్యర్థి శివకుమార్ తన నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్ ఫారం-26
- నోటరీ చేసిన సంతకం 23వ తేదీతో ఉంటే, నిర్ధారిస్తూ శివకుమార్ చేసిన సంతకం 24వ తేదీతో ఉన్న దృశ్యం

- వైసీపీ నామినేషన్లు తిరస్కరించాలని డిమాండ్
- శివకుమార్ నామినేషన్ ఆమోదంపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- మురళీకృష్ణ నామినేషన్ ఆమోదంపై కోర్టుకు వెళ్తాం : నరేంద్ర

తెనాలి, పొన్నూరులో అభ్యంతరాలు

తెనాలి(ఆంధ్రజ్యోతి), పొన్నూరుటౌన్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన స్క్రూటీనీ శుక్రవారం ఆయా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో జరిగింది. స్క్రూటీనీ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో జరిగింది. అయితే గుంటూరు జిల్లా పొన్నూరు, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్క్రూటీనీలో ఉత్కంఠ నెల కొంది. తెనాలి, పొన్నూరు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెనాలిలో కాంగ్రెస్ తరపున ఇద్దరు నామినేషన్లు వేయగా వారి నామినేషన్లు తిరస్కరకు గురయ్యాయి. ఇక గుంటూరు పశ్చిమ, వినుకొండ లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయి.

వేర్వేరు తేదీల్లో అన్నాబత్తుని సంతకాలు

తెనాలి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమర్పించిన నామినేషన్‌లో వేర్వేరు తేదీల్లో సంతకాలు ఉండటంపై టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన నోటరీ చేసిన సంతకం ఒక తేదీతో, అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాల్లో మరో తేదీతో సంతకాలు ఉన్నాయని ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని తేల్చారు. ఈ నెల 23వ తేదీతో నోటరీ సంతకం ఉండగా, అభ్యర్థి సంతకం ఈ నెల 24వ తేదీతో ఉందని అభ్యంతరం చెప్పిన టీడీపీ నాయకులు దానిని తిరస్కరించాలని ఆర్వోకు సూచించారు. అయితే స్క్రూటీనీ అనంతరం ఆ నామినేషన్‌ను అనుమతించినట్లు ఆర్వో ఆన్‌లైన్‌లో పెట్టేశారు. దీనిపై టీడీపీ ఎన్నిల సంఘానికి ఫిర్యాదు చేయగా ఈసీ ఏవిధమైన నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠత నెలకొంది. అయితే శివకుమార్ భార్య పుష్ప స్వతంత్ర అభ్యర్థిగా చివరి రోజు దాఖలు చేసిన నామినేషన్ చెల్లుబాటైనట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

మురళీకృష్ణ ఆస్తుల వివరాలపై అభ్యంతరం

పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ తన అఫిడవిట్‌లో భార్య, కుమార్తె ఆస్తుల వివరాలు అందచేయలేదని ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని టీడీపీ నాయకులు తెలిపారు. నోటరీ చేసిన వ్యక్తి అనుమతి గుంటూరుకే పరిమితమైనందున అది చెల్లదని ఫిర్యాదు చేశారు. తాము లేవనెత్తిన అభ్యంతరాల మేరకు అంబటి నామినేషన్‌ను తిరస్కరించకుండా ఆమోదించినందున కలెక్టర్‌కు, సీఈవో, న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు నరేంద్రకుమార్ స్పష్టం చేశారు.

గజదొంగ అంబటి : ధూళిపాళ్ల

పొదుపు మహిళలకు చెందిన రూ.2.5 కోట్లను తన సొంత ఖాతాలకు మళ్లించుకుని కాజేసిన గజదొంగ అంబటి మురళీకృష్ణ అని పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విలేకర్ల సమావేశంలో ఆరోపించారు. వనిత భారతీ, బాపట్ల మహిళా, భావపురి మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ సొసైటీలు, రత్నమణి మహిళా మ్యాక్స్ లిమిటెడ్ వంటి సొసైటీల్లో మహిళలు దాచుకున్న నగదును మురళీకృష్ణ రుణాల పేరుతో సొంత ఖాతాలకు మళ్లించుకున్నారన్నారు. ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లోనే ఈ అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. అంబటి నామినేషన్‌లో పలు అభ్యంతరాలపై తాము ఫిర్యాదు చేసినా అధికారులు ఆమోదించడం సరికాదన్నారు. బీ ఫారం సమర్పించలేదని స్వయంగా అభ్యర్థి చెప్పినా తానే ఎక్కడో పెట్టినట్లు ఆర్వో నింద తనమీద వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల అధికారులు వైసీపీ నేతల ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు.




నామినేషన్ల పరిశీలనకు హాజరైన నరేంద్ర కుమార్, మురళీ

తెనాలిలో కాంగ్రెస్ గాయబ్

తెనాలిలో కాంగ్రెస్ తరపున ఇద్దరు వేసిన నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొదట తెలంగాణకు చెందిన బషీద్ షేక్‌ను తెనాలి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల ప్రకటించి ఎన్నికల ప్రచార సభలో ఆయనను గెలిపించాలని కోరారు. అయితే ఆయన నామినేషన్ వేసిన తర్వాత తమ అభ్యర్థి ఆయన కాదని, స్థానికంగా ఇప్పటి వరకు ఆ పార్టీ వ్యవహారాలు చూస్తున్న డాక్టర్ చందు సాంబశివుడినే ఖరారు చేశారు. చివరి రోజున ఆయన హడావిడిగా నామినేషన్ వేశారు. అయితే బషీద్ ఓటు తెలంగాణలో ఉండటంతో ఆయన నామినేషన్‌ను స్క్రూటీనీలో అధికారులు తిరస్కరించారు. రెండో అభ్యర్థిగా రంగంలోకి దిగిన సాంబశివుడు నామినేషన్ బీ ఫారం విషయంలో తిరస్కరణకు గురైంది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరూ రంగంలో లేకుండాపోయారు.

రజిని, బొల్లా నామినేషన్లపై అభ్యంతరాలు



నామినేషన్‌లో తప్పుడు సమాచారాన్ని అందించిన పత్రం

గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థి మంత్రి విడదల రజిని, వినుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్లపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వారి నామినేషన్ తప్పులతడక అని తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రజిని ఇష్టం వచ్చినట్లు అఫిడవిట్‌ను మార్చి వేశా రని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస రావు మండిపడ్డారు. అమెరికా పౌరసత్వం కలిగిన రజిని భర్త కుమారస్వామి నిబంధనలకు విరుద్ధంగా చిలకలూరిపేటలో భూమి కొనడం చట్ట విరుద్ధమన్నారు. రజిని ఆదాయం లక్షల్లో ఉంటే రూ.కోట్లతో ఆస్తులు ఎలా కొనుగోలు చేస్తుందో చెప్పాలన్నారు. సాక్ష్యాధారాలతో అభ్యంతరాలు చెప్పినా రజిని నామినేషన్ ఆమోదంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు.

- బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్‌లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆమోదించారని న్యాయవాదులు మూర్తి, గోపినాథ్, జైభారత్ అభ్యర్థి చిరంజీవినాయక్ తెలిపారు. విద్యార్హత విషయంలో తేడాలు ఉన్నాయని, కేసుల అంశాలు ప్రస్తావించలేదని తెలిపారు. బొల్లా నిశాని అయితే ఇంగ్లీష్‌లో ఎలా సంతకం చేశారని, సంతకం నేర్చుకొని ఉంటే న్యాయమూర్తి చేత అఫిడవిట్ చేసి ఆర్వోకు నామినేషన్ పత్రంతో అందించాల న్నారు. వీటిపై త్వరలో హైకోర్టులో పిటీషన్ వేస్తామని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

- ఎస్పీ బిందుమాధవ్

మాచర్లటౌన్, ఏప్రిల్ 26: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జమ్మలమడక, మోత్కుమల్లి, గన్నవరం, కంభంపా డు, రాయవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకం, అత్యంత సమస్యాత్మకం, సాధారణం అనే విధంగా విభజించామన్నారు. అనంతరం ఆయాచోట్ల గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో గతంలో జరిగిన ఘటనలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే పోలీసు శాఖకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై సెల్:9440796184 కు సమాచారం అందించాలన్నారు. అలాగే పట్టణంలోని స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ పల్లపు రాజు, మాచర్ల రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



గన్నవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ



మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

ఓటుతోనే గుణపాఠం చెబుదాం

● గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెదనందిపాడు, ఏప్రిల్ 26: సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు ప్రజలు ఓటుతోనే గుణపాఠం చెప్పాలని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నాగభైరువారిపాలెం, జరుగులవారిపాలెం, ఉప్పలపాడు, పరిటాలవారిపాలెం, అన్నవరం, పాలపర్రు, రాజుపాలెం, ఏటీపాలెం, జీజీపాలెం, రావిపాడు, గోగులమూడి, కత్రపాడు, పుసులూరు, పమిడివారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక అధ్యయనం చేశామని, టీడీపీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామన్నారు. తాగు, సాగునీటి సమస్య, పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే టీడీపీ ధ్యేయమన్నారు. ఈ ప్రాంతంలో రైతులు పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నియోజకవర్గాల్లో నిరుద్యోగులకు వృత్తి నైపుణ్యానికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి, పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ పేరుతో రైతుల పొలాల్లో హద్దు రాళ్ళపై జగన్ ఫొటోలు అంటించారని, ప్రజల ఆస్థిపై తన ఫొటో ముద్ర వేసుకోవడమేనా ప్రజా సంక్షేమం అని ప్రశ్నించారు. ప్రతి పేద వారిని లక్షాధికారిని చేయడమే చంద్రబాబు కల అని అన్నారు. అభివృద్ధికి పట్టంకట్టే కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తమ ఆస్తులను కుదవపెట్టి పక్క రాష్ట్రాలకు వెళ్ళి బతకాల్సి వస్తుందన్నారు. ఈ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడి సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు విసుగుచెంది వ్యతిరేకంగా ఉన్న మాలాంటి ఎందరో నాయకులు ప్రజాసంక్షేమం గురించి ఆలోచించి టీడీపీ వైపు అడుగులు వేశామని, అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జనసేన, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్లు కొర్రపాటి నాగేశ్వరరావు, పరాంకుశ శ్రీనివాసరావు, కన్నా రవిదేవరాజు, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ ముజీబ్, సర్పంచ్ దండా శాంతకుమారి, కమ్మ నాగమల్లేశ్వరరావు, రావిపాటి కృష్ణప్రసాద్, ఎంపీటీసీ బొగ్గవరపు లక్ష్మీతిరుపతమ్మ, గ్రామపార్టీ అధ్యక్షులు బొగ్గవరపు చంద్రశేఖర్, నంగినేని రోశయ్య, పెంట్యాల శ్రీధర్, జాగర్లమూడి శ్రీనివాసరావు, పొన్నం నాగేశ్వరరావు, జంపని హనుమంతరావు, ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్, నాయకులు పోపూరి రామచంద్రరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మదమంచి వాసు, కుర్రి సుబ్బారెడ్డి, నిడుమోలు శ్రీనివాసరావు, కమ్మ వీరయ్య, దండా వీరయ్య, యాగంటి బొల్లారావు, గేరా వంశీ, ధూళిపాళ్ళ మోహనరావు, తుమ్మల కనకయ్యచౌదరి, రావి శివరామకృష్ణయ్య, ఆళ్ళ రాజారావు, చంద్రయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిపై జగన్ మూడు ముక్కలాట

● కర్నూలు, విశాఖలో ఒక్క ఇటుకా పేర్చలేదు
● అమరావతి పనులు కొనసాగివుంటే లక్ష మందికి ఉపాధి
● అధికారంలోకి రాగానే అమరావతి పనులు ప్రారంభిస్తాం
● మంగళగిరి ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్26: అసెంబ్లీ సాక్షిగా 2014లో జగన్ మాట్లాడుతూ.. అమరావతికే సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ప్రకటించి.. అధికారంలోకి రాగానే మూడు రాజధానులను తెరమీదకు తీసుకువచ్చి అమరావతి విషయంలో మాటతప్పి మడమ తిప్పారని' టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కృష్ణాయపాలెం ప్రాంతవాసులతో లోకేశ్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమరావతి పనులను కొనసాగించివుంటే లక్షమందికి ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాటకు తెరతీసి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారన్నారు. కర్నూలు, విశాఖపట్నంలో కనీసం ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. రాజధాని ఇక్కడే వుంటుంది, జగన్‌ను నేను ఒప్పిస్తానని చెప్పిన ఆళ్ల రామకృష్ణారెడ్డి మూడు రాజధానులకు మద్దతుగా ఓటు వేశారని చెప్పారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కృష్ణాయపాలెం దళిత రైతులు ఆందోళన చేస్తే మాదిగలపై ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించి జైలుకు పంపారని, ఆ రైతులకు టీడీపీ అండగా నిలిచిందని గుర్తుచేశారు. అమరావతిలో ఏర్పాటు చేసిన ఎస్‌ఆర్‌ఎం, విట్ యూనివర్సిటీలలో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగిపోయిన అమరావతి పనులను ప్రారంభించి ఈ ప్రాంతంలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని లోకేశ్ స్పష్టం చేశారు.



కృష్ణాయపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న నారా లోకేశ్



సమస్యలపై లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణాయపాలెం వాసులు

పాతికేళ్ల అభివృద్ధిని విస్మరించారు

పాతికేళ్లుగా మంగళగిరి నియోజకవర్గంలో గెలిచినోళ్లు ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని లోకేశ్ విమర్శించారు. తాను ఇక్కడి ఓడినప్పటికీ ప్రజల మనస్సు గెలవాలని భావించి సొంత నిధులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. గత అయిదేళ్ల నుంచి తాను చేసిన సంక్షేమంలో గెలిచిన వాళ్లు కనీసం పది శాతమైనా చేశారా అని ప్రశ్నించారు. అబద్ధాలను చెప్పడంలో సీఎం జగన్‌తోపాటు ఆళ్ల రామకృష్ణారెడ్డి వంటి సామంతులు మాస్టర్స్ డిగ్రీ చేశారన్నారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణంతోపాటు ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని, కృష్ణాయపాలెం నుంచి పెనుమాక వెళ్లే బ్రిడ్జిని పునర్నిర్మాస్తామని, అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా మంగళగిరి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానన్నారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న నారా లోకేశ్

సమస్యలపై లోకేశ్‌కు వినతి

కృష్ణాయపాలెం వాసులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దళిత శ్మశానవాటికకు వెళ్లే రహదారి, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, ఇళ్లులేని వారికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మించాలని, జాతీయ రహదారికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని, పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని, విద్యార్థులకు పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేయాలని, చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలపై లోకేశ్ స్పందిస్తూ ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తామని, దామాషా ప్రకారం శ్మశానాలకు స్థలాలు కేటాయిస్తామని, నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడంతోపాటు ప్రభుత్వ స్థలాల్లో నివాసం వుంటున్న వారికి శాశ్వత పట్టాలిస్తామని, రైతులను ఆదుకుంటామని, మద్యం నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, లారీలపై గ్రీన్ ట్యాక్స్ భారం తగ్గిస్తామని, పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేస్తామని, చదువుకున్న యువతకు అర్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

రాష్ట్రంలో వైసీపీ పనైపోయింది

● కూటమి ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణదేవరాయలు
● డాక్టర్ అరవిందబాబుతో కలసి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు తదితరులు

రొంపిచర్ల, ఏప్రిల్ 26: రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని మునమాక, విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ, ముత్తనపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబుతో కలసి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ ప్యాక్ సర్వేలన్నీ బోగస్ అన్నారు. ఆ సర్వేలతో ప్రజలను, ఎమ్మెల్యేలనే కాక ముఖ్యమంత్రిని కూడా మోసం చేస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలకు రూ.700 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రలోభాలతో జనాన్ని తరలిస్తున్నారన్నారు. తాను ఏనాడు వైసీపీని విమర్శించ లేదన్నారు. తనపై అనవసరంగా వక్రీకరించి రాతలు రాస్తున్నారని తెలిపారు. పల్నాడులో టీడీపీకి ఎక్కడ చూసినా జనం ప్రభంజనంలా వస్తున్నారన్నారు. ఆ పార్టీ మాదిరిగా ఎక్కడా ప్రలోభాలు పెట్టలేదన్నారు. సోషల్ మీడియాలో తనపై చేస్తున్న అసత్య ప్రచారాలను ఘాటుగా ఖండించారు. పల్నాడు ప్రజల ఆశీస్సులతో ముందుకు వెళ్తున్నానన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గాలి టీడీపీ వైపు తిరిగిందని, ఎక్కడ చూసినా సభలకు, కార్యక్రమాలకు స్వచ్ఛందంగా ప్రజలు తరలి వస్తున్నారన్నారు. రైతు పంట కోసం ఏ విధంగా కష్టపడతాడో పల్నాడు కోసం, ప్రజల కోసం తాను కష్టపడుతున్నానని తెలిపారు. ప్రజలు తమ పార్టీ వైపే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల వరకు ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుడు కష్టపడుతూ ఉండాలన్నారు.

అరవింద బాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తమ విజయం తథ్యమన్నారు. నరసరావుపేట అసెంబ్లీ సీటు గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తానన్నారు. నరసరావుపేట నియోజక వర్గంలో ప్రతి చోట టీడీపీకి మెజార్టీ వస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానీ, బీజేపీ నాయకులు రామకృష్ణ, గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, రామ్మూర్తి, ఇంటూరి ప్రసాదు, వేణు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

● ఒక గంట ముందుగా కేంద్రాలకు రావాలి
● గుంటూరు నగరంలో 14, తెనాలిలో 3 పరీక్షా కేంద్రాలు
● జిల్లా కో-ఆర్డినేటర్ శేఖర్ వెల్లడి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 26:పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు కేంద్రాలకు కనీసం ఒక గంట ముందుగా చేరుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ టి.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్ కోసం జిల్లాలో మొత్తం 14 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గుంటూరు నగరంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఆయా కేంద్రాలలో 4,628 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే మరో వైపు తెనాలిలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆయా కేంద్రాల నుంచి 772 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్బంధం ఘటనలో

పోలీసులకు సమన్లు

చుండూరు ఏప్రిల్ 26 : జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి, చుండూరుకు చెందిన గూదేటి బాలకోటిరెడ్డిని అక్రమంగా నిర్బంధించారన్న కేసులో తెనాలి రెండవ అదనపు కోర్టు శుక్రవారం పోలీసులకు సమన్లు జారీచేశారు. 2023 జూలై 2న అప్పటి చుండూరు ఎస్ఐ నవీన్‌కుమార్ బాలకోటిరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లు తిప్పుతూ అతన్ని చిత్ర హింసలకు గురిచేశారు. దీనిపై కోటిరెడ్డి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కోర్టు విచారణ అనంతరం అప్పటి చుండూరు సీఐ అంబటి రాజ మోహన్, ఎస్ఐ నవీన్‌కుమార్, అమర్తలూరు, కొల్లూరు, భట్టిప్రోలు, నగరం ఎస్ఐలు సురేష్, గార్లపాటి రాజ్యలక్ష్మీ, అంబటి చంద్రశేఖర్, డీ.రామకృష్ణలకు ఐపీసీ 365, 346, 324, 509 సెక్షన్ల కింద పోలీసు అధికారులకు సమన్లు జారీచేశారు.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

ఎన్నికల్లో పోటీ చేసే అర్హత వైసీపీకి లేదు

● 1592 చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఏప్రిల్ 26: రాష్ట్ర రాజధానిని నాశనం చేద్దామనుకునే వైసీపీ వారికి ఓట్లు ఎలా వేస్తారని అమరావతి రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1592వ రోజుకు చేరుకున్నాయి. విజనరి రాష్ట్ర సీఎం అయితే భావి తరాల వారి భవిష్యత్ బంగారు బాట అవుతుందని స్పష్టం చేశారు. అప్పులుచేసి పాలించటం ఎవరైనా చేస్తారని, సీఎం కానవసరం లేదన్నారు. అభివృద్ధిచేసి సంపదను సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేసే వారే సీఎం కావాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో నిరసన దీక్షలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష స్వాధీనం


తెనాలి రూరల్, ఏప్రిల్ 26: నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద ఓ కారులో రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో దుగ్గిరాల మీదుగా తెనాలి వైపు వస్తున్న ఓ కారును నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయగా ఎటువంటి బిల్లులు లేకుండా ఉన్న రూ. లక్ష నగదును గుర్తించి సీజ్‌చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

సత్యా ఎలక్ట్రానిక్ షోరూం ప్రారంభం

గుంటూరు, ఏప్రిల్ 26: గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో పాత ఇన్‌కంటాక్స్ కార్యాలయ భవనంలో సత్యా ఎలక్ట్రానిక్ గృహోపకరణాల షోరూం ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జాన్సన్ అసారియా, ప్రాపర్టీ ఓనర్ శ్రీనివాస్‌లు శుక్రవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతమైన, నమ్మకమైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను అందించే సత్యా సంస్థలో అందరికి అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, ఎల్ఈడీ టీవీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని కంపెనీల ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను నాణ్యమైన, నమ్మకమైన వస్తువులతో పాటు అందుబాటు ధరల్లో అందించటమే సత్యా సంస్థ లక్ష్యమన్నారు. ప్రతి రూ.20 వేల పైన కొనుగోలుపై బంగారు నాణెం ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అంతేగాక వివిధ రకాల బ్రాండ్లకు చెందిన మొబైల్ ఫోన్‌ల నుంచి మిక్సీలు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కూలర్లు ఒకే షోరూంలో అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో సత్యా సంస్థ జనరల్ మేనేజర్ సెండిల్ కుమార్ పలువురు సంస్థ సిబ్బంది ఉన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న ఎండీ జాన్సన్ అసారియా, ప్రాపర్టీ ఓనర్ శ్రీనివాస్



గుంటూరులోని సత్యా షోరూం

62,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 59,655 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 62,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,701 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	18000
నెంబరు. 5	10000	15500
273	12000	14000
341	8000	17000
4884	11000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	17000
దేవనూరు డీలక్స్	8500	15500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147, 156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

పల్నాడు వార్తలు



టీడీపీలో చేరిన వారితో జూలకంటి బ్రహ్మారెడ్డి

అన్నదాతలకు అండగా నిలిచేది టీడీపీయే..

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 26: అన్నదాతకు అండగా నిలిచేది టీడీపీయేనని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వెల్దుర్తి మండలంలోని పట్లవీడు, శివలింగాపురం గ్రామాల్లోని వైసీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల 70 కుటుంబాలు బత్తుల అంకారావు ఆధ్వర్యాన బ్రహ్మారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యమవుతుందన్నారు. సూపర్ 6 పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. పార్టీలో చేరినవారిలో సాయికుమార్, మల్లయ్య, శ్రీను, శివయ్య, రమణ, వెంకటేష్, తాడికొండ అంజిరెడ్డి, పెద్ద కోటయ్య, నాగరాజు, చల్లా వెంకట్రావు, నాగేశ్వరరావు, గోపయ్య తదితరులు ఉన్నారు.

అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వరికపూడిశెల పూర్తి చేస్తాం..

వెల్దుర్తి: కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని పట్లవీడు, మండాదిలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గౌతమ్‌రెడ్డి, కుర్రి శివారెడ్డి, శివారెడ్డి, కళ్లెం రామాంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ముస్లింలకు అంతా నష్టమే ..

కారంపూడి / రెంటచింతల ఏప్రిల్ 26: జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ముస్లింలకు అన్ని విధాలా నష్టమే జరిగిందని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. శుక్రవారం కారంపూడి పట్టణంలోని ముస్లింల వీధుల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



జగనాసుర రక్త చరిత్ర ప్రతులను ఆవిష్కరించిన కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

అన్ని వర్గాలను అవస్థపెట్టిన వైసీపీ

●టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 26 : రాష్ట్రంలో అన్ని వర్గాలను అవస్థ పెట్టిన ఘనత వైసీపీది, జగన్‌దేనని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో అరాచకపాలన అంతం.. కూటమి పంతం, జగనాసుర రక్త చరిత్రపై ఎన్డీఏ చార్జిషీట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జగన్ ప్రతి వ్యక్తికి రూ.10 లక్షలు అప్పు చేసి, ఈ రోజు సంక్షేమం, అభివృద్ధిని తుంగలో తొక్కాడన్నారు. బటన్ నొక్కుతున్నానని చెప్పి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూ.లక్ష కోట్లను దారిమళ్లించాడన్నారు. నాసిరకం మద్యం రేట్లుపెంచి లక్షల కోట్లరూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారన్నారు. రైతాంగానికి నీళ్ళు ఇవ్వలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ప్రశ్నించినవారిని హింసించడం, పత్రికల వారిని ఇబ్బంది పెట్టారని, అందుకనే వైసీపీ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించడానికి ఎన్డీఏ కూటమి వచ్చిందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాస్టర్, టీడీపీ జిలా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు / అచ్చంపేట : ఒక్క ఛాన్స్‌తో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని, ప్రజలను దోచేశాడని టీడీపీ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు శుక్రవారం సాయంత్ర క్రోసూరు మండలం నాగవరంలో ఆయన టీడీపీ, జనసేన నేతలతో సమాలోచనలు జరిపారు. అలాగే అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వ్యాపారులకు వెన్నుదన్నుగా ఉంటా ..

- అధికారంలోకి రాగానే కేసుల తొలగింపునకు కృషి
- గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని
- వైసీపీపాలనలో వాణిజ్యరంగం కుదేలు: ఎమ్మెల్సీ దువ్వారపు
- పల్వరైజర్స్ అసోసియేషన్ నేతలతో సమావేశం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 26: రేపటి ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యాపారులకు అండగా ఉండటంతో పాటు ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తీర్చడంలో ముందుంటానని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పల్వరైజర్స్ అసోసియేషన్ నేతల సమావేశానికి యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందన్నారు. ప్రైవేటు సంస్థకు రాయల్టీ అప్పగించడంతో రాయల్టీ చెల్లింపు ఒక్కోరకంగా వసూలు చేయడం, అదనపు విద్యుత్ బిల్లులు బాదుడుతో పాటు వ్యాపారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, లోకేశ్‌లు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే వ్యాపారులపై వున్న అన్నిరకాల కేసులను తొలగించడం, నోటీసులను రద్దుచేస్తామన్నారు. వ్యాపారాల్లో బయటివ్యక్తుల ప్రమేయం లేకుండా ఎవరి వ్యాపారాలు వారు సొంతంగా చేసుకునేందుకు వీలు కల్పిస్తానన్నారు.

ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యాపారాలలో ఆపార్టీ నేతల మితిమీరిన జోక్యం కారణంగా వ్యాపారస్థులు సజావుగా వ్యాపారాలు చేసుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఒక్క పిడుగురాళ్లే కాదు విజయవాడ, కడపతో పాటు పలు ప్రాంతాలలో కమీషన్ల కోసం వ్యాపారులను వేధించడం, ఆస్తులను రాయించుకోవడమే అధికార పార్టీ నేతల పనిగా మారిందన్నారు. గతంలో టీడీపీపాలనలో వాణిజ్య వ్యాపారరంగాలు ఎలా ఉన్నాయో, ఇప్పుడు ఎలా దిగజారాయో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు కోట సుబ్బారావు, భవనాశి నరసింహారావు, యక్కల కాశి, పసుమర్తి సుబ్రహ్మణ్యం, హరి, సత్యం, జుజ్జూరి మురళీ, తదితర వ్యాపార సంఘాల నేతలు పాల్గొన్నారు.



పల్వరైజర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

టీడీపీలోకి చేరికలు... దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. యడ్లపల్లి పెదమల్లయ్య, పిన్నం జానకి, శంకర్‌తో పాటు పలువురికి యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా గురజాల మండలం కొత్త అంబాపురంకు చెందిన ఎస్టీ, కాపు సామాజికవర్గానికి చెందిన 30 కుటుంబాలు, పందిటివారిపాలెం గ్రామానికి చెందిన వెన్నా వెంకటేశ్వరరెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, వెన్నా నరసింహారెడ్డితో పాటు మరికొన్ని కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాలలో పులుకూరి కాంతారావు, శివనాగు, పులిబండ్ల లక్ష్మీనారాయణ, రామారావు, పీ. పరంజ్యోతి, నారాయణ, స్వామినాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

అభివృద్ధి వుంటేనే సంక్షేమం జరుగుతుందని టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్ అన్నారు. పట్టణంలోని 8, 9వ వార్డుల్లో, వీరాపురం గ్రామంలో ఇంటింటికి తిరిగి యరపతినేని శ్రీనివాసరావుకు ఓటు వేయాలని కోరారు. గ్రామంలో గురువారం రాత్రి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పలువురు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన యరపతినేని

కూటమితోనే అందరికీ సంక్షేమం

● ఎన్నికల ప్రచారంలో యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 26: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమౌతుందని గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నియోకవర్గ పరిధిలోని పందిటివారిపాలెం, చిన అగ్రహారం, పెద అగ్రహారం, చెన్నాయపాలెం, తుమ్మలచెరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యరపతినేని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల నుండే అర్హులందరికీ రూ.4 వేల పింఛన్ అందజేస్తామన్నారు. అలాగే వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదన్నారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. వైసీపీలో బీసీ ఎమ్మెల్సీలకే గౌరవం లేకుండా ఉందని, ఇక కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వైసీపీకి ఓటేస్తే మన జీవితాలను ఆ ప్రభుత్వానికి తాకట్టు పెట్టినట్టేనని అన్నారు. పిడుగురాళ్ల జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో అధినేతల ఆజ్ఞలతో తాను పిడుగురాళ్ల మండలానికి ఏమీ చేయలేక పోయానన్నారు. కార్యక్రమాలలో గండికోట వెంకటేశ్వర్లు, వేముల వినోద్‌రెడ్డి, మేకల రాంబాబు, సాంబశివరావు, యడ్లపల్లి నారాయణ, కామిశెట్టి రమేష్, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, ముప్పాళ్ల సాంబయ్య, యడ్లపల్లి శివ, యర్రంరెడ్డి వెంకట్రామిరెడ్డి, యర్నాన రామకృష్ణతో పాటు తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పందిటివారిపాలెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న యరపతినేని

బంగారం, నగదు అపహరణ

దాచేపల్లి, ఏప్రిల్ 26: ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన శుక్రవారం మండలంలోని నడికూడి గ్రామంలో చోటు చేసుకుంది. వెన్ను హనుమంతరావు రెండు రోజులక్రితం గుంటూరులోని తన కుమార్తె ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం గుంటూరు నుండి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాను పరిశీలించి చూడగా బీరువాలో వున్న 8సవర్ల బంగారం, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు హనుమంతరావు గుర్తించాడు. ఈ విషయంపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు దాచేపల్లి సీఐ సురేంద్రబాబు పర్యవేక్షణలో ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్స్ సంఘటనా స్థలానికి చేరుకొని సాక్షాదారాలు సేకరించారు.

టీడీపీ బూత్ కన్వీనర్‌పై దాడి

పెదకూరపాడు,ఏప్రిల్ 26: భాష్యం ప్రవీణ్ నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాడని మండలంలోని 75 తాళ్ళూరుకు చెందిన టీడీపీ పోలింగ్ బూత్ కన్వీనర్ తిరుమలపూడి వెంకట గోపిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కొల్లి లింగారెడ్డి దాడిచేశాడు. ఈ ఘటనపై వెంకట గోపీ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి గ్రామంలోని ఒక ఫంక్షన్‌కు వెంకటగోపి వెళ్లాడు. అక్కడకు వచ్చిన లింగారెడ్డి 'నామినేషన్‌కు ఎందుకు వెళ్ళావు.. మీకు ఏ పనులు కావాలన్నా మేం చేసి పెట్టాం కదా' అని అంటూ వెంకటగోపిపై దాడిచేశాడు. లింగారెడ్డితో పాటు గోవర్ధనరెడ్డి, కోటిరెడ్డిలు కూడా తనను తిట్టారని వెంకటగోపి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ వీ.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా అట్టు వేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సైకో పాలనకు చరమగీతం పాడండి..

● ఎన్నికల ప్రచారంలో కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 26: సైకో పాలనకు చరమగీతం పాడాలని సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని 14వ వార్డులో కన్నా ముమ్మరంగా ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తూ, మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కూటమి అధికారంలోకి రాగాఏ అమరావతి రాజధాని నిర్మాణ పనులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, పోట్ల ఆంజనేయులు, డాక్టర్ పోట్ల అరుణకుమారి, సీతయ్య, చౌట శ్రీనివాసరావు, వెంకట కోటయ్య, మారెళ్ళ మల్లేశ్వరరావు, అతుకూరి నాగేశ్వరరావు, మామిడి వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా చాగంటివారిపాలెంలో పర్యటిస్తున్న కన్నా

ఇచ్చింది గోరంత.. నొక్కింది కొండంత

ముప్పాళ్ళ: సీఎం జగన్ ప్రజలకిచ్చింది గోరంతైతే.. నొక్కేసింది కొండంత అని సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చాగంటి వారిపాలెంలో కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుండి సీఎం జగన్ మోసపూరిత హామీలతో అన్నివర్గాలను మోసం చేశాడని అన్నారు. ప్రజలపై అన్నిరకాలుగా పెను ఆర్థిక భారాలను మోపి కుటుంబాలను గుల్లచేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు ద్వారానే ఈ ప్రభుత్వానికి తగిన సమాధానం చెప్పాలన్నారు. అలాగే సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలోకి విచ్చేసిన కన్నాను ట్రాక్టర్లతో ర్యాలీగా గ్రామంలోకి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో బత్తుల నాగేశ్వరరావు, మదిర రామ్మోహన్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సర్పంచులు మల్లవరపు చంద్రశేఖర్, పోలూరి యలమంద, దరువూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వైసీపీ ప్రచారం.. అడ్డుకున్న పోలీసులు

మండలంలోని చాగంటి వారిపాలెంలో శుక్రవారం కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న నేపథ్యంలో ఇందుకు పోటీగా గ్రామంలోని కొందరు వైసీపీ నేతలు అనుమతి లేకుండా ఇంటింటికీ ప్రచారాన్ని చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ హజరతయ్య గ్రామానికి చేరుకొని వైసీపీ నేతల ప్రచారాన్ని నిలిపివేయించారు. టీడీపీ ప్రచారం ప్రశాంతంగా జరిగింది.

కూటమి ప్రభుత్వంతోనే రైతులు, రైతుకూలీలకు మేలు

సత్తెనపల్లి రూరల్ : కూటమి ప్రభుత్వంతోనే రైతు, రైతు కూలీలకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ యువనేత కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని నందిగామ అడ్డరోడ్డు వద్ద వ్యవసాయ కూలీలతో శుక్రవారం కన్నా నాగరాజు మాట్లాడారు. పనులు, కూలీ రేట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రైతులు, రైతుకూలీలతో పాటు అన్నివర్గాల ప్రజలు కూటమి అభ్యర్థులను బలపరచాలని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని కోరారు. ముందుగా ఆయన ఫణిదం గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ఆదాయాన్ని దోచుకున్న ఎమ్మెల్యే నంబూరు

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె

క్రోసూరు, ఏప్రిల్ 26 : రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఇసుక ఆదాయంతో స్థానిక సంస్థలను అభివృద్ధి చేసుకోవచ్చని, అటువంటి ఆదాయాన్ని ఐదు సంవత్సరాలుగా స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దోచుకుతింటున్నారని జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం క్రోసూరులో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డికి, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు, మంత్రులకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదన్నారు. దోపిడీ దారుల, దొంగల సమూహంతో ఏర్పాటు చేసిన పార్టీ వైసీపీ అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యపాన నిషేధం చేస్తానన్న వ్యక్తి, పిచ్చిమద్యం అమ్మి వేల కోట్లు దోచుకున్నాడని మండిపడ్డారు. అమరావతి నుంచి బెల్లంకొండ రోడ్డు పూర్తి చేసిన తర్వాతనే ఓట్లు అడుగుతానని చెప్పిన ఎమ్మెల్యే శంకరరావు 10శాతం కూడా రోడ్డుపని పూర్తి చేయలేదని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దత్తపుత్రుడు నంబూరు కళ్యాణ్ స్థానికంగా జనసేన కార్యకర్తలపై ఉమ్మి వేసినట్టుగా తమ దృష్టికి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బకుదెబ్బ చేసి తీరుతామని హెచ్చరించారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు వంచనకు, దోపిడీకి, దౌర్జన్యాలకు గురయ్యారన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి భాష్యం ప్రవీణ్, లావు శ్రీకృష్ణదేవరాయలు గెలుపునకు కృషి చేయాలని గాదె కోరారు. ఈ సందర్భంగా క్రోసూరు కొండకింద బజారుకు చెందిన 150 మంది వైసీపీ కార్యకర్తలు కంభంపాటి రాము నాయకత్వంలో జనసేనలో చేరగా వారి మెడలో జనసేన కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు.



జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులతో గాదె వెంకటేశ్వరరావు

బరిలో అభ్యర్థులు వీరే..

మాచర్ల రూరల్, ఏప్రిల్ 26: మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీకి 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో స్క్రూటీని నిర్వహించారు. మొత్తం 24 మంది నామినేషన్లు వేయగా 15 మంది బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. జూలకంటి బ్రహ్మానందరెడ్డి (టీడీపీ), పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (వైసీపీ), డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి (కాంగ్రెస్ పార్టీ), గుండాల సైదులు (బీఎస్పీ), బచ్చు వెంకటేశ్వరు (పిరమిడ్ పార్టీ), యెనుముల కేశవరెడ్డి (తెలుగు రాజ్యాధికారి పార్టీ), స్వతంత్ర్య అభ్యర్థులు తొమ్మిది మంది బరిలో నిలిచారు.

పెదకూరపాడులో 11 మంది ఖరారు..

పెదకూరపాడు: పెదకూరపాడులో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములు అభ్యర్థుల నామినేషన్ పత్రాలను శుక్రవారం పరిశీలించారు. మొత్తం 42 మంది 51 నామినేషన్‌లు వేయగా 11 మంది అభ్యర్థులు తుది జాబితాలో ఉండగా, 31 మంది నామినేషన్‌లను తిరస్కరించినట్లు తెలిపారు. భాష్యం ప్రవీణ్ (టీడీపీ), నంబూరు శంకరరావు (వైసీపీ), పమిడి నాగేశ్వర రావు(కాంగ్రెస్ పార్టీ), వరగాని ఏడుకొండలు(బీఎస్పీ), ఆలా రామకృష్ణారావు (భారత చైతన్య యువజన పార్టీ), స్వతంత్ర్య అభ్యర్థులుగా గౌతుకట్ల అంకమరావు, సెట్టి సింగరయ్య, నంబూరు కళ్యాణ్ చక్రవర్తి, పరగటి రాజు, బంకా తిరుపతయ్య, బాణావత్ మురళీకృష్ణా నాయక్‌ల నామినేషన్‌లు ఖరార య్యాయి. పలువురి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా లేక పోవటం తో తొలగించినట్టు ఆయన వివరించారు.

గురజాల నియోజకవర్గంలో 13 మంది..

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి మొత్తం 25మంది అభ్యర్థులు 37 నామినేషన్ పత్రాలను అందజేశారని ఆర్వో రమణాకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం 13 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా వున్నట్లు తెలిపారు. యరపతినేని శ్రీనివాసరావు (టీడీపీ), కాసు మహేష్‌రెడ్డి(వైసీపీ), తియ్యగూర యలమందారెడ్డి(కాంగ్రెస్), నాగెండ్ల యోబు (బీఎస్పీ), కనకం శ్రీనివాసరావు(నేషనల్ నవక్రాంతి పార్టీ), జూలూరి రమేష్(జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ), గడ్డం శ్రీనివాసరావు(ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి పార్టీ), నీరుమళ్ల శ్రీనివాసరావు (అఖిల భారతీయ జన సంఘ్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా కొప్పురావూరి వెంకట పురుషోత్తమరావు, గంగవరపు మల్లమ్మ, చీదెళ్ల నాగార్జున, బాదం వెంకటేశ్వరరెడ్డి, కోయ రామారావు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఆర్వో రమణాకాంత్‌రెడ్డి తెలిపారు.

జన కేతనం

136 ఆమోదం.. 70 తిరస్కరణ

● ముగిసిన లోక్‌సభ, అసెంబ్లీ నామినేషన్ల పరిశీలన


నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో శివశంకర్

నరసరావుపేట, ఏప్రిల్ 26: జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం జరిగింది. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో లోక్‌సభ స్థానానికి, ఆయా నియోజకవర్గాల్లోని ఆర్వో కార్యాలయాల్లో అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల స్క్రూటినీ అభ్యర్థులు, వారి ఏజంట్ల సమక్షంలో జరిగింది. జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 70 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. మొత్తం 206 మంది అభ్యర్థులు 326 నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో 62 మంది అభ్యర్థులకు చెందిన 113 నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. 213 నామినేషన్లను ఆమోదించారు. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి 27 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు దాఖలు చేశారు. వాటి పరిశీలన అనంతరం 8 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. 19 మంది అభ్యర్థులకు చెందిన 28 నామినేషన్లను ఆమోదించారు. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి చెందిన నామినేషన్లను ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ నామినేషన్ల స్క్రూటినీ చేశారు. డాక్టర్ లావు మేఘన రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా అందులో టీడీపీ అని పేర్కొనగా వాటిని తిరస్కరించారు. టీడీపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు వైసీపీ అభ్యర్థి పీ అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గర్నెపూడి అలెగ్జాండర్‌సుధాకర్ నామినేషన్‌ను ఆమోదించారు. బహుజన సమాజ్‌పార్టీ, ఇండియా ప్రజాబంధు పార్టీ, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. ఇక ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి దాఖలు చేసిన 286 నామినేషన్లలో 101 నామినేషన్లను తిరస్కరించగా 185 నామినేషన్లను ఆమోదించారు.

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య	తిరస్కరణ	ఆమోదం
నరసరావుపేట లోక్‌సభ	27	8	19
నరసరావుపేట అసెంబ్లీ	25	9	16
పెదకూరపాడు	26	15	11
చిలకలూరిపేట	33	7	26
సత్తెనపల్లి	22	2	20
వినుకొండ	24	8	16
గురజాల	25	12	13
మాచర్ల	24	9	15


కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న అబ్జర్వర్ శ్రీహరి ప్రతాప్ షాహి

ఎన్నికల పరిశీలకుల నియామకం

నరసరావుపేట, ఏప్రిల్ 26 సార్వత్రిక ఎన్నికలు నిర్వహణలో భాగంగా ఈసీఐ ఆదేశాల మేరకు చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా శ్రీహరి ప్రతాప్‌షాహి నియమితులయ్యారు. ఆయన జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్‌ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం, మీడియా సెంటర్‌ను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 91546 90375 నెంబర్‌లో అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఆరుగురి.. అరంగేట్రం

● ప్రధాన పార్టీల నుంచి ఎన్నికల బరిలో కొత్త ముఖాలు

● టీడీపీ నుంచి ఒకరు... వైసీపీ నుంచి ఐదుగురు

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగి ప్రత్యర్థులపై నెగ్గి అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఆయా అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. గుంటూరు జిల్లాలోని ఒక లోక్‌సభ, 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ తరఫున పోటీ చేస్తున్న వారిలో చాలామందికి ఇవే ప్రథమ ఎన్నికలు.

గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ తరుపున డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బరిలో నిలిచారు. ఆయన ప్రత్యక్షంగా పోటీ చేయడం ఇదే ప్రప్రథమం. 2014, 19లో నరసరావుపేట ఎంపీ సీటు కోసం ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ఈసారి చంద్రబాబుని మెప్పించి ఒప్పించి సాధించారు. టిక్కెట్ పొందిన రోజు నుంచే ఆయన తనదైన శైలిలో గ్రౌండ్‌వర్కు చేసుకొంటూ దూసుకుపోతున్నారు. పెమ్మసాని ఎంపీ అభ్యర్థిగా రావడంతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు కొండంత బలం వచ్చినట్లు అయింది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమాకు ఇవే తొలి ఎన్నికలు. తన తండ్రి ముస్తఫాకు వారసురాలుగా వచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గళ్లా మాధవి రాజకీయాలకు కొత్త. ఆమె భర్త రామచంద్రరావు రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా సుపరిచితుడు. ప్రత్తిపాడులో వైసీపీ అభ్యర్థి బాలసాని కిరణ్‌కు ఇవే తొలి ఎన్నికలు. పొన్నూరులో మంత్రి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీకృష్ణకు సీటు ఇచ్చింది. తొలిసారి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. మంగళగిరిలో వైసీపీ మరోసారి కొత్త అభ్యర్థి మురుగుడు లావణ్యని బరిలోకి దింపింది. ఆమె రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చారు.

నిస్వార్థ నేత.. కోలా సుబ్బారెడ్డి

● ప్రాణమిత్రుడు కాసు బ్రహ్మానందరెడ్డిపై పోటీచేసి గెలిచిన కమ్యూనిస్టు యోధుడు


కోలా సుబ్బారెడ్డి, కూతురు భానుమతి

మాచర్లటౌన్, ఏప్రిల్ 26: రాటుతేలిన రాజకీయ జీవితం కోలా సుబ్బారెడ్డిది. 1942 ఆగస్టులో క్విట్ ఉద్యమంలో పాల్గొని కాంగ్రెస్ కార్యకర్తగా కదలూరు, తంజావూరు జైలు కెళ్లి రెండు సంవత్సరాల పాటు మోటూరు హనుమంతరావు, చండ్ర రాజేశ్వరరావు, మాజీ రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్‌తో సాన్నిహిత్యం పెరిగింది. జైలు నుంచి రాగానే కమ్యూనిస్టుగా మారిపోయారు. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొని అజ్ఞాత వాసం గడిపిన వారే కోలా సుబ్బారెడ్డి. గుంటూరులోని టౌన్ స్కూల్‌లో చదువుకున్నారు. 1952 సాధారణ ఎన్నికల్లో మాచర్ల గురజాలను కలిపి పల్నాడు నియోజకవర్గంగా పిలిచేవారు. ఆ ఎన్నికల్లో కాసు బ్రహ్మానందారెడ్డిపై పోటీ చేసి కమ్యూనిస్టు అభ్యర్థిగా కోలా సుబ్బారెడ్డి మంచి మెజార్టీతో గెలిచారు. ఈయన తామ్రపత్ర గ్రహీత.. స్వాతంత్ర్య సమర యోధుల పింఛన్ తిరస్కరించిన త్యాగశీలి సుబ్బారెడ్డి. 1917 సెప్టెంబర్‌లో దాచేపల్లిలో జన్మించారు. అనేక భూపోరాటాలు చేసి గ్రామీణుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. ప్రస్తుతం దాచేపల్లిలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌కు సుమారుగా 18 ఎకరాల పొలాన్ని ఉచితంగా అందచేశారు. సుబ్బారెడ్డికి ఐదుగురు సంతానం. వారిలో ఒకరైన రెంటచింతలకు చెందిన మోదుగు భానుమతి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అప్పట్లో కక్షలుండేవి కావని, ఎడ్లబండి మీద వెళ్లి ప్రచారం చేశారని ఎన్నికల ఖర్చు రూ.250కు మించలేదని తమ తల్లిదండ్రులు చెప్పే వారన్నారు. మా నాన్నపై బ్రహ్మానందరెడ్డి ఓడిపోయినా పింఛన్ విషయంలో చొరవ తీసుకుని ఇప్పించారని, అప్పుడు నేతల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమన్నారు. సుబ్బారెడ్డి 1992 డిసెంబర్ 5న మృతి చెందగా భార్య చెన్నమ్మ 2016 ఆగస్టులో మృతి చెందారు. మాచర్ల నుంచి కమ్యూనిస్టు పార్టీ తరపున ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగు పెట్టగా వారిలో సుబ్బారెడ్డితో పాటు 1955 ఎన్నికల్లో గెలిచిన మందపాటి నాగిరెడ్డి మరొకరు.

30న తెనాలికి చంద్రబాబు

● సుల్తానాబాద్ నుంచి రోడ్ షో


● మార్కెట్ సెంటర్‌లో బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్, పక్కన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

తెనాలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం తెనాలి వస్తున్నట్లు జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు పర్యటన వివరాలను తెలిపారు. హెలికాప్టర్‌లో సుల్తానాబాద్‌లో దిగిన అనంతరం అక్కడి నుంచి చెంచుపేట, మారీస్‌పేట మీదుగా జరిగే రోడ్ షోలో చంద్రబాబు పాల్గొంటారన్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో మాట్లాడతారని చెప్పారు. ఇటీవల పవన్‌కల్యాణ్ పర్యటనను విజయవంతం చేసినట్లే చంద్రబాబు కార్యక్రమాన్ని కూడా రెట్టింపు ఉత్సాహంతో విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులను, అభిమానులను కోరారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో చర్చించి చంద్రబాబు పర్యటన కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న అనేక అంశాలపై చంద్రబాబుకు అవగాహన ఉందని, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక తెనాలికి పూర్వవైభవాన్ని తీసుకొస్తారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, మమ్మద్ ఖుద్దూస్, బీజేపీ జిల్లా నాయకుడు పాటిబండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్ల పాటు వారసులే


ఆలపాటి వెంకట్రామయ్య | దొడ్డపనేని ఇందిర | గోగినేని ఉమ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో 35 ఏళ్ల పాటు అధికారం తండ్రి, కుమార్తె, మనమరాలికి ప్రజలు కట్టబెట్టారు. నియోజకవర్గం చరిత్ర పరిశీలిస్తే ఎన్నికలు మొదలైన 1952 నుంచి 1982 వరకు ఆలపాటి వెంకట్రామయ్య మూడుసార్లు, ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర మూడు పర్యాయాలు, ఆలపాటి మనుమరాలు గోగినేని ఉమ ఒకసారి గెలిచారు. 1952, 1955, 1962లో వెంకట్రామయ్య, 1967, 1972, 1978లో ఇందిర, 1999లో ఉమ విజయం సాధించారు. కేఎల్పీ, సీపీఐ అభ్యర్థులు రావి సత్యనారాయణ, రావి అమ్మయ్యలను వెంకట్రామయ్య ఓడించారు. 1967లో కాంగ్రెస్ టికెట్‌తో గెలిచిన ఇందిర 1972, 1977లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆమె ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా, మరోసారి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి నన్నపనేని వెంకట్రావును ఓడించారు. వెంకట్రామయ్య మనుమరాలు, ఇందిర కుమార్తె అయిన గోగినేని ఉమ ఆనాటి కాంగ్రెస్ దిగ్గజం కొణిజేటి రోశయ్యను ఓడించి సంచలనం సృష్టించారు. 1967లో దొడ్డపనేని ఇందిరకు వచ్చిన మెజార్టీ 32335 ఇప్పటివరకు ఎవరూ అధిగమించలేదు.

విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించండి

● తెనాలిలో పోలీస్ అధికారులతో ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

తెనాలి రూరల్, ఏప్రిల్ 26: ఎన్నికల విధుల్లో పోలీసులు నిస్పక్షపాతంగా వ్యవహరించాలి.. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే తెలుసుకుని వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టండి.. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రణాళికతో ముందుకు సాగాలని ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. శుక్రవారం తెనాలి డీఎస్పీ కార్యాలయానికి విచ్చేసి ఆయన ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చేపట్టాల్సిన విధి విధానాలపై తెనాలి డివిజన్‌లోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలను తూచాతప్పకుండా అమలు చేయాలన్నారు. ఎవరైనా సరే నిబంధనలు ఉల్లంఘిస్తే ఊపేక్షించవద్దన్నారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పట్టణ, గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో సీసీకెమెరాలు, భద్రతా అంశాలపై చేపట్టాల్సిన పలు సూచనలను ఆయన వివరించారు. ఎన్నికల ప్రచారం చేసే వారు ముందస్తుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పర్మిషన్ తీసుకునేలా చూడాలన్నారు. మైక్ అనౌన్స్‌మెంట్స్, ప్రచార కార్యక్రమాలు సమయపాలన తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పట్టణ, గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఎన్నికల సజావుగా జరిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఐజీ ఆదేశించారు. డీఎస్పీ, పట్టణ, రూరల్ సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

తక్షణ పోలీసింగ్.. సమర్ధ్ యాప్

● రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించిన బాపట్ల ఎస్పీ

● ఎస్పీని అభినందించిన సీఈవో


సమర్ధ్ మొబైల్‌యాప్ గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరిస్తున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, ఏప్రిల్ 26: ఎన్నికల్లో క్విక్ పోలీసింగ్‌కి సమర్ధ్ మొబైల్‌యాప్‌ను రూపొందించినట్లు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి బాపట్ల జిల్లాలో ఉపయోగిస్తున్న సమర్ధ్ మొబైల్ యాప్ విశేషాలను ఎస్పీ వివరించారు. ఈ యాప్‌ను ఈనెల 22వ తేదీ నుంచి జిల్లాలో వినియోగిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా పోలీసు అధికారులు డైరెక్ట్‌గా కాల్ చేయవచ్చని ఒక నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో 2వేలమంది పోలీసులకు ఒకేసారి ఆదేశాలు జారీ చేయవచ్చుఅని తెలిపారు. మొబైల్‌కి ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయిన నోటిఫికేషన్ ద్వారా వారికి సమాచారం అందుతుందన్నారు. ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిటిషన్‌లను సంబంధిత పోలీసు అధికారులకు యాప్ ద్వారా పంపి ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించవచ్చు అని తెలిపారు. మొత్తం జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు మొబైల్ నెంబర్స్‌యాప్ నందు పొందుపర్చారని, తద్వారా పోలీసు అధికారులు, సిబ్బంది రియల్ టైమ్, లొకేషన్ ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించటానికి యాప్ నుంచి నేరుగా కంట్రోల్‌రూమ్‌కు కాల్ చేయటానికి సమస్యాత్మక ప్రాంతాలకు తక్షణమే పోలీసు బలగాలను చేరుకోవటానికి ఈ యాప్ పనిచేస్తుందని సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు ఎస్పీ వివరించారు. అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టార్ ఆఫీసర్లు వినియోగించాలని చెప్పారు. యాప్‌ను అభివృద్ధి పరిచి ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్న బాపట్ల ఎస్పీని సీఈవో అభినందించారు. కార్యక్రమంలో అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎంఎన్ హరీంద్రప్రసాద్, బాపట్ల ఐటీ కోర్ ఎస్ఐ నాయుబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

గురజాల బరిలో.. పురుషులే

● ఇప్పటికి 12సార్లు ఎన్నికలు

● అత్యధికంగా ఏడవసారి బరిలో యరపతినేని

100 Gurajala Assembly Constituency



పిడుగురాళ్ల, ఏప్రిల్ 26: పల్నాడులో రాజకీయ చైతన్యం కలిగిన గురజాలకు ఓ ప్రత్యేకత వుంది. పల్నాడు చరిత్రకు గురజాలకు అవినాభావ సంబంధం వుంది. 800 ఏళ్ల చరిత్ర కలిగిన పల్నాడుకు 1952లో దేశవ్యాప్తంగా జరిగిన సాధారణ ఎన్నికలలో గురజాల, మాచర్ల కలిపి పల్నాడు నియోజకవర్గంగా వుండేది. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణతో 1955లో గురజాల అసెంబ్లీ స్థానం ఏర్పాటైంది. 1955లో గురజాల అసెంబ్లీ స్థానానికి మొట్టమొదట ఎన్నికలు జరుగగా 2019తో కలుపుకొని మొత్తం 12సార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో పురుషులు మాత్రమే పోటీ చేయగా ఒక్కసారి కూడా మహిళలు పోటీ చేసిన దాఖలాలు లేవు. వచ్చే మే నెల 13న జరుగనున్న ఎన్నికలతో 13వ సారి గురజాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 1955లో మొట్టమొదటి ఎన్నికలలో క్రిష్‌కార్ లోక్‌పార్టీ తరుపున మండవ బాపయ్య చౌదరి, సీపీఐ తరపున కోలా సుబ్బారెడ్డి పోటీ చేయగా మండల బాపయ్య చౌదరి గెలుపొందారు. 1962లో కాంగ్రెస్ తరుపున కొత్త వెంకటేశ్వర్లు, సీపీఐ తరపున కోలా సుబ్బారెడ్డి పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థి కొత్త వెంకటేశ్వర్లు గెలుపొందారు. 1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున కొత్త వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సీఎం గడిపూడి పోటీ చేయగా కొత్త వెంకటేశ్వర్లు గెలుపొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరపున మందపాటి నాగిరెడ్డి, కాంగ్రెస్ తరపున కొత్త వెంకటేశ్వర్లు తలపడగా సీపీఐ అభ్యర్థి మందపాటి నాగిరెడ్డి గెలుపొందారు. 1978లో కాంగ్రెస్(ఐ) తరుపున గడిపూడి మల్లికార్జునరావు, సీపీఐ తరపున మందపాటి నాగిరెడ్డి, జనతా పార్టీ తరుపున మహ్మద్ మొహిద్దీన్‌లు పోటీ పడగా కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి గడిపూడి మల్లికార్జునరావు గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున జూలకంటి నాగిరెడ్డి, కాంగ్రెస్ తరుపున కాసు వెంకట కృష్ణారెడ్డి పోటీపడగా టీడీపీ అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డి గెలుపొందారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో టీడీపీ తరపున ముత్యం అంకిరెడ్డి, కాంగ్రెస్ తరపున కాయితి వెంకట నర్సిరెడ్డిలు పోటీపడగా టీడీపీ అభ్యర్థి ముత్యం అంకిరెడ్డి గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున కాయితి వెంకట నర్సిరెడ్డి, టీడీపీ తరపున రాచమడుగు (అనుమోలుశెట్టి) సాంబశివరావు పోటీపడగా కాంగ్రెస్ అభ్యర్థి కాయితి వెంకట నర్సిరెడ్డి గెలుపొందారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ తరపున కనకం రమేష్ చంద్రదత్ తలపడగా టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జంగా కృష్ణమూర్తి పోటీలో నిలవగా కాంగ్రెస్ అభ్యర్థి జంగా కృష్ణమూర్తి గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ తరపున జంగా కృష్ణమూర్తి పోటీపడగా జంగా కృష్ణమూర్తి గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ తరపున ఆలా వెంకటేశ్వర్లు, ప్రజారాజ్యం పార్టీ తరపున గుర్రం గోపిశ్రీధర్ తలపడగా టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ తరుపున జంగా కృష్ణమూర్తి పోటీ పడగా టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ తరపున కాసు మహేష్‌రెడ్డి, జనసేన పార్టీ తరపున చింతలపూడి శ్రీనివాసరావులు పోటీ పడగా కాసు మహేష్‌రెడ్డి గెలుపొందారు. గురజాల నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటికి 13 సార్లు ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థిగా 1994 నుంచి ఇప్పటి వరకు ఏడుసార్లు యరపతినేని శ్రీనివాసరావు పోటీచేయగా 1994, 2009, 2014లో గెలుపొందారు. జంగా కృష్ణమూర్తి 1999, 2004లో గెలుపొందారు. త్వరలో జరుగనున్న 2024 ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరపున యరపతినేని శ్రీనివాసరావు, కాసు మహేష్‌రెడ్డిలు మరలా తలపడనుండగా విజయం ఎవరిని వరించనుందో ఓటరు మహాశయులకే ఎరుక.

ఇద్దరు ఎన్నికల పరిశీలకులు..


నీరజ్ కుమార్ | కార్తీక

గుంటూరు సిటీ, ఏప్రిల్ 26: జిల్లా లోని ఏడు నియోజకవర్గా ల కు కేంద్ర ఎన్ని కల కమి షన్ ఇరువురు పరిశీల కులను శుక్ర వారం నియమించింది. ఐఏఎస్ నీరజ్‌కుమార్ మంగ ళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులయ్యారు. ఎన్నికల ఏజంట్లకు, ఓటర్లకు నీరజ్ కుమార్ ఫోన్ నెంబరు 9154882127లో అందు బాటులో ఉంటార ని పత్రికా ప్రకటనలో తెలిపారు. మరో ఐఏఎస్ కార్తీక తాడికొం డ, ప్రత్తిపాడు, గుం టూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ అసెంబ్లీ నియో జక వర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా వచ్చారు. ఆమె ఫోన్ నెంబరు 9154882128లో అందుబాటులో ఉంటారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



జగనాసుర రక్త చరిత్రను ఆవిష్కరించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

అన్ని వర్గాలను ఇబ్బందిపెట్టిన వైసీపీ

● కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో అన్నివర్గాలను ఇబ్బందిపెట్టిన ఘనత వైసీపీది, జగన్‌దేనని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో అరాచకపాలన అంతం.. కూటమి పంతం, జగనాసుర రక్త చరిత్ర ఎన్‌డీఏ చార్జిషీట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జగన్ ప్రతి వ్యక్తికి రూ.10 లక్షలు అప్పుచేసి, ఈ రోజు సంక్షేమం, అభివృద్ధిని తుంగలో తొక్కాడన్నారు. బటన్ నొక్కుతున్నానని చెప్పి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూ.లక్ష కోట్లను దారిమళ్లించాడన్నారు. నాసిరకం మద్యం రేట్లుపెంచి లక్షల కోట్లరూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారన్నారు. రైతాంగానికి నీళ్ళు ఇవ్వలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ప్రశ్నించినవారిని హింసించడం, పత్రికల వారిని కూడా ఇబ్బంది పెట్టారని, అందుకనే వైసీపీ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించడానికి ఎన్డీఏ కూటమి వచ్చిందన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ, పవన్ కళ్యాణ్, అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు అవసరం రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాస్టర్, టీడీపీ జిలా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో మాలలకు తీరని అన్యాయం

● ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వని ఏకైక సీఎం జగన్‌రెడ్డి
● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు



మాలల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 26: జగన్ ప్రభుత్వంలో మాలలకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు విమర్శించారు. తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్లో మాలల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి కూడా రుణాలు ఇవ్వని ఏకైక సీఎం జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక 5వేల మంది దళితులపై దాడులు జరిగాయని, అనేకమందిని హత్యచేసి పొట్టన పెట్టుకున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులుచేసి వారిపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిన చరిత్ర జగన్మోహన్‌రెడ్డిదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లలు ఇతర దేశాలకు వెళ్ళి చదువుకునేందుకు విదేశీవిద్య కోసం చంద్రబాబునాయుడు 15లక్షల ఆర్థిక సాయం చేశారని, జగన్మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. విదేశీ విద్యకు చంద్రబాబునాయుడు అంబేద్కర్ పేరు పెడితే జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీలకు జగన్ రద్దు చేసిన 27సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం రాగానే పునరుద్ధరిస్తామని జీవీ భరోసా ఇచ్చారు. ఎస్సీ,ఎస్టీ, కార్పొరేషన్ నిధులను దారి మళ్ళించి వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. టీడీపీ హయాంలోనే మాలలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని రాష్ట్ర ఏఎన్‌పీఎస్ అధ్యక్షుడు జి.చార్వక అన్నారు. మాలలంతా ఐక్యంగా ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గోదా జాన్‌పాల్, కొమ్మతోటి పౌలు, విజయ్, ఏకుల రాజశేఖర్, గడిపూడి ఏసురత్నం, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, గుంటూరు ఆశీర్వదం, జంగా కృష్ణ, రుద్రపాటి రాజు, కనుముల అంకారావు, కొట్టి ఆంజనేయులు,కొమ్మతోటి కేశవ, మీసాల ప్రసాద్, బాబు, విప్పర్ల విజయేందరరావు, కొమ్మతోటి రవిబాబు, గురుమూర్తి, గడిపూడి రమేష్, బాగ్యరాజు, లాలిబాబు తదితరులు పాల్గొన్నారు.



గుంట్లపల్లిలో టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు తదితరులు

బొల్లాపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

బొల్లాపల్లి, ఏప్రిల్ 26: మండలంలోని గుట్లాపల్లి, బొల్లాపల్లి గ్రామా ల నుంచి అధికార వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి మాజీ ఎమ్మె ల్యే జీవీ ఆంజనేయులు, శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ లీలావతిలు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుట్లపల్లి నుంచి ఐదు కుటుంబాలు, బొల్లాపల్లి నుంచి మూడు కుటుంబాలు పార్టీలో చేరారు. వీరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చేవరకు నిరుద్యోగ యువతకు రూ.3వేలు



ఎన్నికల ప్రచారానికి వచ్చిన హరీష్‌ను సత్కరిస్తున్న స్థానికులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 26: ఎన్నికల అనంతరం రాబోయే ప్రజా ప్రభుత్వంలో యువతకు 20లక్షల ఉద్యోగాలతోపాటు, ఉద్యోగం వచ్చే వరకు 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో జీవీ ఆంజనేయులు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోటిఫికేషన్ లేక ఉద్యోగాలు లేక యువత అల్లాడిపోతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నగటున రోజుకు ఒక ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంటున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. అది ఎన్‌సీఆర్‌బీ లెక్క చెప్పిన చేదునిజమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యువత ఆలోచించి తమకు మేలు చేసే వారికి ఓటువేసి ఎన్ను కోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌తోపాటు పీవీ సురేష్‌లతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు..

మాజీ ఎంపీటీసీ షేక్ ఫరుద్దీన్ కుమారుడు ఆల్‌ఇండియా ముస్లిం లీగ్ పార్టీ వినుకొండ ఇన్‌చార్జి షేక్ అహమ్మద్‌సనా కూటమి అభ్యర్థి జీవీ అంజనేయులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 22వ వార్డులో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన పెద్ద మసీదు వద్ద ముస్లింలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా 14వ వార్డు నుంచి అధికార వైసీపీని వీడి మూడు కుటుంబాలు టీడీపీలో చేరారు. జీవీతోపాటు నియోజకవర్గ పరిశీలకులు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొల్లాపల్లి మండలం గుట్లపల్లి గ్రామం వలంటీర్‌తోసహా ఐదు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

జగన్‌రెడ్డిని సాగనంపే బాధ్యత మహిళలదే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 26: ఐదు సంవత్సరాలుగా ప్రజలను అన్ని విధాలా మోసంచేసిన జగన్‌రెడ్డిని, అతడి ప్రభుత్వాన్ని సాగనంపే బాధ్యత గ్రామీణ ప్రాంత మహిళలదేనని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోను, గణపవరం, పసుమర్రులో మండలనేని సుబ్బారావు ఆధ్వర్యంలో పొగాకు గ్రేడింగ్ పాయింట్లను ప్రత్తిపాటి సందర్శించి అక్కడ పనిచేస్తున్న మహిళతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై దుర్మార్గాలు, వారికి జరిగిన అన్యాయాలను వివరించి ముఖ్యంగా జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న మద్యం విధానం మహిళలకు ఎంత చేటు చేసిందో, వారి జీవితాలను ఎంత దుర్భరంగా మార్చిందో గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రభుత్వాన్ని తక్షణమే సాగనంపి కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కోరారు. సైకిల్ గుర్తుకు ఓట్లువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, బీజేపీ కన్వీనర్ జయ రామిరెడ్డి, మండలనేని చరణ్ తేజ, టుబాకో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి వెంకట కుమారి



పొగాకు గ్రేడింగ్ పాయింట్‌లో మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆసరా నాల్గో విడత డబ్బులు ఇస్తున్నట్టు బటన్ నొక్కి మూడు నెలలు గడిచినా పైసాకూడా వారి ఖాతాల్లో జమకాలేదన్నారు. డ్వాక్రా మహిళలను వైసీపీ సభలు, సమావేశాలకు రాకపోతే రుణాలు, సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారన్నారు.

వెంకట కుమారి ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 26: రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ డబ్బులు ఎగగొట్టింది కాక అధికార వైసీపీ వారిపై వేధింపులకు పాల్పడుతోందని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని13, 14 వార్డుల్లో మద్దినగర్‌లో ఇంటింటికి వెళ్ళి సూపర్ - 6 కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం పార్టీ కూటమికి

సైకో పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలి: శరత్

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో కొనసాగుతున్న సైకో పాలనకు ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని 7వ వార్డు డైక్‌మెన్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, దండమూడి రోడ్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. స్థానికుల నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. జగన్ లాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే యువశక్తికి భవిష్యత్ అంధకార మవుతుందన్నారు. . కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం పట్టభద్రుల్లో 24శాతం నిరుద్యోగంతో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు.

పరిశ్రమలు లేకుండా యువతకు ఉపాధి ఎలా



జాలాదిలో జరిగిన ఇంటింటి ప్రచారంలో వృద్ధుడిని పలకరిస్తున్న ప్రత్తిపాటి శరత్

జాలాది (యడ్లపాడు), ఏప్రిల్ 26: పరిశ్రములు లేకుండా యువతకు ఉపాధి కల్పించడం ఎలా సాధ్యమని మాజీమంత్రి, చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ ప్రశ్నించారు. గురువారం రాత్రి మండలంలోని జాలాది గ్రామంలో పుల్లారావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. . మాజీ ఎంపీపీ కందిమళ్ళ రఘురామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పి.శ్రీమన్నారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో టీడీపీ ముఖ్యనేతల ఆత్మీయ సమావేశం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 26: నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ ముఖ్యనేతల ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జంగా కృష్ణమూర్తి, నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కలిశారు. ఎన్నికల ప్రణాళిక, ప్రచారం, భవిష్యత్ ప్రణాళికల పలు అంశాలపై చర్చించారు. నరసరావుపేట గడ్డపై కూటమి జెండా ఎగరబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అరాచకాలు, అకృత్యాలపై చర్చించారు. ఎన్నికల వ్యూహాలు, జగన్ మోహన్‌రెడ్డి చేయబోయే కుట్రల గురించి కూలంకషంగా మాట్లాడారు. ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో జరిగినమేలు కంటే కీడే ఎక్కువ అని డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఓటమి భయంతో జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని రకాల కుట్రలకైనా తెగిస్తాడని, పార్టీ శ్రేణులు అందుకు సంసిద్ధంగా ఉండాలని నేతలు పిలుపునిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ చదలవాడ, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

27 ఎస్సీల సంక్షేమ పథకాలు రద్దుచేసిన జగన్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 26: ఎస్సీలకు చెందిన 27 సంక్షేమ పథకాలు జగన్‌మోహన్‌రెడ్డి రద్దుచేశారని డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని విజయకుమార్ కల్యాణ మండపంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ఆధ్వర్యంలో జనసేన ఎస్సీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ దళితద్రోహి జగన్‌మోహన్‌రెడ్డిని గద్దెదించి దళితులకు అండగా నిలిచే చంద్రన్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామని అన్నారు. దళితులపైనే అట్రాసిటీ కేసు నమోదు చేసిన దుర్మార్గుడు జగన్ మోహన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోడికత్తి డ్రామాతో దళిత బిడ్డను ఐదేళ్లపాటు తల్లిదండ్రులకు దూరం చేశాడన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్యచేసిన అనంతబాబును వెంటేసుకొని తిరుగుతున్నాడన్నారు. దళిత ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొట్టినప్పుడే దళితులకు అసలైన స్వాతంత్రం లభిస్తుందని అన్నారు.



ఎస్సీ నేతల ఆత్మీయ సమేశనంలో పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ తదితరులు

అరవిందబాబును కలిసిన కాపునేత జమ్ముల

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 26: ఎన్డీఏ కూటమి నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబును టీడీపీ కార్యాలయంలో కలిసి పట్టణ ముఖ్య కాపు నేత జమ్ముల శ్రీనివాసరావు శుక్రవారం టీడీపీలో చేరారు. జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ళుగా పార్టీ జెండా మోసిన కార్యకర్తలని, నాయకులని నట్టేట ముంచాడని మండిపడ్డారు. జెండామోసిన పాపానికి నియోజకవర్గంలో రాష్ట్రంలో తలెత్తుకోనికుండా చేశారని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల కోసం నిలిచే ప్రజానాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి నడుస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీలో చేరిన వైసీపీనేతలు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 26: అధికారపార్టీ ప్రలోభాలను సైతం ధిక్కరించి కూటమితో కలిసి వైసీపీ నేతలు, సామాన్య పౌరులు నడుస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని శివసంజీవయ్య కాలనీలో ప్రచారానికి వెళ్ళిన డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో టీడీపీ నేతలు గిద్దల వెంకటేశ్వర్లు, చింతిరాల బాలు ఆధ్వర్యంలో 20వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అరాచకాలు, అసమర్థ పాలనను ఇంక భరించలేమన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా నియోజకవర్గాన్ని కనీసం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ప్రజలలో ఉంటూ, ప్రజలకోసం పనిచేసే డాక్టర్ చదలవాడ అరవిందబాబను గెలిపించుకుంటామన్నారు.



టీడీపీలో చేరిన శివ సంజీవయ్య కాలనీ వైసీపీ కుటుంబాలు

నేత్రదానం అభినందనీయం



నేత్రదానం చేసిన కోటిబ్రహ్మం

వేల్పూరు (శావల్యాపురం), ఏప్రిల్ 26: చనిపోయిన వ్యక్తి నేత్రాలను దానం చేయడం అభినందనీయమని అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరుకు చెందిన శ్రీపెరంబుదూరి కోటిబ్రహ్మం అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు పెదకాకాని శంకర్ ఆస్పత్రిలోని ఐ బ్యాంక్ సిబ్బందికి సమాచారమందించారు. ఐబ్యాంక్ సిబ్బంది కోటి లింగం కళ్ళలోని రెండు కార్నియా పొరలను సేకరించారు. ఐబ్యాంక్ డాక్టర్ చేతనలక్ష్మి మాట్లాడుతూ దాతలు మృతదేహాన్ని మార్చురీబాక్స్‌లో పెట్టిన 8గంటల లోపు నేత్రదానం చేయాలన్నారు. నేత్రదానం చేసిన కోటిలింగం కుటుంబ సభ్యులు ఎస్పీ రామపరమేశ్వరరావు, రామకృష్ణ, శేషమ్మ, శ్రీలక్ష్మి, శ్రీనివాసరావులను ఐబ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

నరసరావుపేటలో పోలీసుల కవాతు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 26: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వర్మ సూచనలతో నరసరావుపేట మొదటి పట్టణ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు ఉన్న ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత యుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా పటిష్ఠ ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. కవాతులో బీఎస్ఎఫ్, సివిల్ పోలీసులు సుమారు 30మంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

● ఈపూరు: మండలంలోని ఇనుమెళ్ళ, బొమ్మరాజుపల్లి, అంగలూరు, కొచ్చెర్ల గ్రామాల్లో శుక్రవారం పల్నాడు జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు ఆధ్వర్యంలో సాయుధ బలగాలు కవాతు చేశారు. అడిషనల్ ఎస్పీతో పాటు నర్సరావుపేట డీఎస్పీ వర్మ, వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావు, ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్,సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండలో 16మంది అభ్యర్థుల పోటీ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 26: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థులుగా 24మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆర్వో సుబ్బారావు నామినేషన్ పత్రాలకు స్క్రూటినీ నిర్వహించారు. మొత్తం 16మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ అభ్యర్థిగా జీవీ ఆంజనేయులుతోపాటు వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, బీఎస్పీ మాసిపోగు ఏసోబు, కాంగ్రెస్‌పార్టీ నుంచి చెన్నా శ్రీని వాసరావు, పిరమిడ్ పార్టీ నుంచి గడ్డం రమణ, జైబారత్ నేషనల్ పార్టీ నుంచి చిరంజీవినాయక్, జాతీయ జనసేన పార్టీ నుంచి టి.అనిల్‌కుమార్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నుంచి కూకటపల్లి ప్రసాద్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా చిన్న కాశియ్య, ఎస్‌కే బాజి, బచ్చు వెంకట రవికుమార్, నరాలశెట్టి శ్రీనివాసరావు, బొల్లా వీరాంజనేయులు, జెడ్డ శ్రీనివాసరావు, ములక సీతారాం, కూచిపూడి విజయ్‌కుమార్‌లు పోటీలో నిలిచారు. ఈ నెల 29వ నాటికి పూర్తి నివేదిక అందజేయనున్నట్లు ఆర్వో సుబ్బారావు తెలిపారు.

న్యాయవాది సురేష్ ఆకస్మిక మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 26: పట్టణానికి చెందిన న్యాయవాది చిట్టిమాల సురేష్‌బాబు(45) శుక్రవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు అమూల్య, ఏడుకొండలు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అయన మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. సురేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోగులకు బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ

యడ్లపాడు, ఏప్రిల్ 26: మండల కేంద్రమైన యడ్లపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, భూషయ్య మెమోరియల్ ఆసుపత్రులలోని రోగులకు, సిబ్బందికి గ్రామానికి చెందిన మానుకొండ రామారావు, లాయర్ మానుకొండ ఉపేంద్రలు శుక్రవారం బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లును పంపిణీ చేశారు. తమ మాతృమూర్తి నారాయణమ్మ ద్వితీయవర్ధంతి సందర్భంగా బిస్కెట్లు, మజ్జిగను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మానుకొండ రామాంజనేయులు, పోపూరి గోపి, మానుకొండ సౌజన్యలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో 26 నామినేషన్లు ఆమోదం

● ఏడు తిరస్కరణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 26: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలకు శుక్రవారం జరిగిన స్క్రూటీనీలో మొత్తం 33 అభ్యర్థుల నామినేషన్లలో 26 నామినేషన్లు ఆమోదించినట్టు ఎన్నికల అధికారి బీ నారదముని శుక్రవారం రాత్రి తెలిపారు. వివిధ కారణాల వల్ల ఏడు నామినేషన్లు తిరస్కరించినట్టుగా ఆయన పేర్కొన్నారు. కాగా నామినేషన్‌లను ఆమోదించిన వారిలో టీడీపీకి చెందిన ప్రత్తిపాటి పుల్లారావు, వైసీపీకి చెందిన కావటి శివనాగ మనోహర నాయుడు, కాంగ్రెస్‌కు చెందిన మద్దుల రాధాకృష్ణలు ఉన్నారు. ఇంకా బహుజన సమాజ్ పార్టీకి చెందిన కొప్పుల బాబూరావు, నవతరం పార్టీకి చెందిన రావు సుబ్రహ్మణ్యం, పిరమిడ్ పార్టీకి చెందిన తన్నీరు రత్నకుమారి కూడా ఉన్నారు. ఇండియన్ లేబర్ పార్టీ(అంబేద్కర్, పూలే)కి చెందిన ముకిరి రామకోటేశ్వరరావు, రాష్ట్రీయ జన క్రాంతి పార్టీకి చెందిన షేక్ గౌస్ బాషా, భారత చైతన్య యువజన పార్టీకి చెందిన దొప్పలపూడి వినయ్ కుమార్ ఉన్నారు. ఇండిపెండెంట్‌లుగా రంగంలో ఒంటరి విజయమ్మ, పఠాన్ రహమ్‌తున్, తమ్ములూరి రమణయ్య, ప్రత్తిపాటి పిచ్చయ్య, చెల్లి దయారత్నం, తనుబుద్ధి సుందర రామిరెడ్డి, పొన్నెగంటి సాంబశివరావు, కొర్నిపూడి సాయి గణేష్, టీ శివరామ్ వినయ కుమార్, బహుజనకు రాజేష్, కట్టా కిరణ్ కుమార్, ప్రత్తిపాటి రవి బాబు, గుడిమెట్ల శాంతమ్మ, దామర్ల మనోహర్, కట్టా గౌతమ్, మారెళ్ళ రామిరెడ్డి, నల్లమోతు మాదవరావులు ఉన్నారు.



లగడపాటి అంజిబాబు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణ దేవరాయలు, అరవిందబాబు తదితరులు

అంజిబాబుకు టీడీపీ నాయకుల నివాళి

రొంపిచర్ల, ఏప్రిల్ 26: మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన లగడపాటి అంజిబాబు ఇటీవల మృతిచెందారు. కాగా సంతగుడిపాడులో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, వడ్లమూడి కిషోర్, కుమ్మెత కోటిరెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చూపిన విద్యార్థికి సత్కారం

చిలకలూరిపేట, ఏప్రిల్ 26: పట్టణంలోని సాదినేని చౌదరయ్య స్కూల్‌లో నిజాయితీ చూపిన విద్యార్థి జగదీష్‌ను ఆ స్కూల్ యాజమాన్యం శుక్రవారం ఘనంగా సత్కరించింది. 8వ తరగతి చదువుతున్న అతడు స్కూల్‌లో నడిచి వెళ్తుండగా వెండి చైన్ అతడికి దొరికింది. సుమారు రూ.3వేలు విలువ చేసే ఆ చైన్‌ను ఆ విద్యార్థి స్కూల్ డైరెక్టర్ సీ ప్రభాకరరెడ్డి వద్దకు వెళ్ళి అందజేశారు. ఇందుకు స్పందించిన ఆయన స్కూల్ యాజమాన్యాన్ని పిలిపించి నన్నపనేని శాయి నీత్, భార్గవ్ నగేష్, రాధా ప్రియాంక తదితరుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. అతడి నిజాయితిని అభినందించి ప్రతి ఒక్కరు నిజ జీవితంలో ఇలాగే వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాషా తదితరులు పాల్గొన్నారు.



రైల్వే గేటు మూసివేతతో నడిచి వస్తున్న మహిళలు

రైల్వే గేటు మూసివేతతో ప్రజలకు ఇక్కట్లు

నాదెండ్ల, ఏప్రిల్ 26: మండలంలోని సాతులూరు - చందవరం గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేటును ఆ శాఖ అధికారులు శుక్రవారం ఉదయం మూసివేశారు. రెండు రోజుల పాటు మరమ్మతుల నిమిత్తం ఈ గేటున పూర్తిగా మూసివేయటంతో పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గేటును మూసివేయాలంటూ కనీసం రెండు రోజుల ముందు ఆయా గ్రామాల ప్రజలకు సమాచారం ఇవ్వాలి. సాతులూరు, చందవరం వైపు బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కనీసం అలాంటి అలాంటి చర్యలు చేపట్టకుండానే గేటు మూసివేశారు. ఈ గేటు మార్గం గుండా పలు విద్యా సంస్థలకు చెందిన బస్సులు, నరసరావుపేట పట్టణానికి ప్రతిరోజు వందలాది మంది కార్మికులు, ప్రయాణికులు నాదెండ్ల, యడ్లపాడు మండలాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ముందస్తు సమాచారం లేకుండా గేటు మూయటంతో అనేకమంది గేటు వరకు వెళ్ళి వెనక్కి రావాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా ఎండలు మండిపోతుంటంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి వరకు ఈ గేటు మూసే ఉంటుందని అధికారులు తెలిపారు.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణుల కుటుంబాల్లో వెలుగులు

● బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్

నాదెండ్ల, ఏప్రిల్ 26: టీడీపీ గెలిస్తేనే నాయీ బ్రాహ్మణుల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలోని చందవరంలో బీసీ డిక్లరేషన్, నాయీ బ్రాహ్మణుల హామీలతో కూడిన కరపత్రాన్ని మద్దిరాల గంగాధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందవరంలో పలు నాయీ బ్రాహ్మణుల కుటుంబాలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ఫెడరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధికి గ్రూపు రుణాలు, కార్పొరేషన్‌లతో రుణాలు ఇవ్వటంతో పాటు సెలూన్‌ల ఏర్పాటుకు పరికరాలు ఇవ్వటం జరిగిందన్నారు. బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వటంతో పాటు ప్యార్లర్ల ఏర్పాటుకు తోడ్పాటు అందించారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో తూబాటి బొల్లయ్య, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొల్లా నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారం

● లాయర్ మూర్తి ఆరోపణ

వినుకొండ, ఏప్రిల్ 26: వినుకొండ నియోజకవర్గ అసెంబ్లీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా నామినేషన్‌లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేయడంపై లాయర్ మూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మూర్తి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నామినేసన్ పత్రాల్లో తప్పుడు సమాచారం చేర్చారంటూ గురువారం రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో లాయర్ మూర్తితోపాటు, జైభారత్ పార్టీ అభ్యర్థి చిరంజివి నాయక్‌లు మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు 2009లో పెదకూరపాడు నియోజకవర్గంలో పోటీచేసినపుడు మగదా యూనివర్సిటీ నుంచి బీఏ చదివానని అఫడవిట్ దాఖలు చేశారన్నారు. 2024లో వినుకొండ నుంచి రెండో సారి పోటీచేస్తున్న ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో తాను నిశానని చెప్పడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్వో సుబ్బారావు ఈ సమాచారాన్ని ప్రజలకు తెలియజేయకుండా రహస్యంగా ఉంచారన్నారు. ఈ విషయాన్ని ఆర్వోను వెళ్లి కలిసి ప్రశ్నించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ప్రజాప్రతినిధి ప్రజలకు సరైన పాలన అందించగలరా అని వారు నిలదీశారు. అదేవిధంగా నర్సరావుపేటలో ఏబీఎం ఆస్తులపై గతంలో కేసులు ఉన్నప్పటికి అఫడవిట్‌లో నమోదు చేయలేదని, సురేష్‌మహల్ ఆక్రమణ తొలగింపులో కూడా ఆయనపై కోర్టులో కేసులు ఉన్నాయనే అంశాన్ని ఎందుకు పొందుపర్చలేదన్నారు. ఆర్వో నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజలకు సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బొల్లా ఆర్వోకు ఇచ్చిన నామినేసన్‌పై బొల్లా నిశాని అయితే ఇంగ్లీష్‌లో ఎలా సంతకం చేశారని, సంతకం నేర్చుకొని ఉంటే న్యాయమూర్తితో అఫడవిట్ చేసి ఆర్వోకు నామినేషన్ పత్రంతో పాటు అందించాల్సి ఉందన్నారు. వీటన్నింటిపై త్వరలో హైకోర్టులో పిటీషన్ వేయించి ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయిస్తామని న్యాయవాది గోపీనాథ్ తెలిపారు.